3న సిపిఎం బహిరంగ సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

జనవరి 3న భీమవరంలో జరిగే సిపిఎం జిల్లా మహాసభ బహిరంగ సభను జయప్రదం చేయాలని పాలకొల్లు మండల కన్వీనర్ జవ్వాది శ్రీనివాసరావు కోరారు. బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశానికి దిగుపాటి రాజగోపాల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రజలపై మోయలేని భారాలు వేస్తున్నాయన్నారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. మరోపక్క కరెంట్ ఛార్జీలు పెంచి వేలల్లో బిల్లులు ఇవ్వారన్నారు. ప్రజలు మంచి చేస్తారని అధికారం కట్టబెడితే నెత్తిన బండలు వేస్తున్నారని, ప్రజలు వాపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఆలోచించి, భారాలు తగ్గించాలన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెట్టే ఆలోచన విరమించాలని శ్రీనివాస్ కోరారు. ఈ సమావేశంలో డి.రోజామని, టి.శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

'పెసా' గ్రామసభ ఎన్నికలు ఎప్పుడు..!

అడవి బిడ్డలంటే అధికారులకు అలుసా.. ఏజెన్సీ ప్రజలంటే చిన్నచూపా.. గిరిజన ప్రాంతాల్లో చట్టాల అమల్లో జిల్లా అధికారులకు చిత్తశుద్ధి లేదా' అంటే అవుననే సమాధానం వస్తోంది. ఏజెన్సీలో పెసా (పంచాయతీరాజ్ ఎక్స్‌టెన్షన్ షెడ్యూల్ ఏరియా) గ్రామసభల ఎన్నికల జరపకుండా జిల్లా, ఐటిడిఎ అధికారులు వ్యవరిహస్తున్న నిర్లక్ష్య వైఖరినే అందుకు ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పొచ్చు. ఎన్నికలు నిర్వహించాలంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసి ఆరు నెలలైనా జిల్లా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం చూస్తే ఏజెన్సీ వాసుల హక్కులను ఏవిధంగా హరిస్తున్నారో అర్థంచేసుకోవచ్చు. పెసా గ్రామసభల ఎన్నికలను పక్కకు పెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు అవగాహన సదస్సుల పేరుతో కాలక్షేపణ చేస్తున్నారంటూ తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



GOVERNMENT OF ANDHRA PRADESH
TRIBAL WELFARE DEPARRMENT

MEMO. No.SOW03-11025/4/2023-TCR TI SEC-COTW, dt.01/07/2024

MEMO OF INSTRUCTIONS:

Sub:TWD-TRI-SPMU (LTR&PESA Act)- Elections to the posts of Vice President and Secretary of PESA Gram Sabhas in the Scheduled Area of Andhra Pradesh- Memo of Instructions Issued- Regarding.

Ref: 1. Memo No SOW03-11025/4/2023-TCR TI SEC-COTW Dt. 30th April 2023 of the Director of Tribal Welfare, Govt. of AP.
2. Panchayats (Extension to the Scheduled Areas) Act 1996.
3. Andhra Pradesh Panchayat Raj (Amendment) Act 1998
4. Andhra Pradesh PESA Rules 2011 vide GO Ms No 66, PR, Department Dated 24-03-2011.

*****

Kind attention is invited to the above subject and references cited.

It is to inform that, this office has informed that election process for PESA Gram Sabhas has been withheld until further orders while issuing a Memo in the reference cited since there is need to prepare instruction manual and orientation training to the ITDA officials for smooth conduct of the statutory elections to the posts of Vice President and Secretary of PESA Gram Sabhas.

In pursuant of the Memo cited, it is to inform that, the Parliament enacted the Panchayats (Extension to the Scheduled Areas) Act 1996 (PESA): The provisions of Part IX of the Constitution of India relating to Panchayats are extended subject to such exceptions and modifications to the Scheduled Areas by the Provisions of the Panchayats (Extension to the Scheduled Areas) Act, 1996 (Central Act 40 of 1996).

Whereas the Government of Andhra Pradesh enacted the Andhra Pradesh Panchayat Raj (Amendment) Act 1998 ...

పెసా గ్రామసభల ఎన్నికలు జరపాలంటూ జులైలో జారీచేసిన ప్రభుత్వ ఉత్తర్వులు కాపీ

ఏజెన్సీలో పెసా గ్రామసభ ఎన్నికలపై జిల్లా అధికారులు మొద్దు నిద్ర

గడిచిన జులైలోనే ఎన్నికల నిర్వహించాలంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

ఆరునెలలైనా పట్టించుకోని జిల్లా యంత్రాంగం, ఐటిడిఎ అధికారులు

రంపచోడవరం జిల్లాలో ఎన్నికలు పూర్తయినా ఇక్కడ ఉలుకు పలుకు కరువు

ఎన్నికలు పక్కకుపెట్టి పెసా గ్రామసభలపై అవగాహనా సదస్సులంటూ కాలక్షేపం

ప్రభుత్వం గుర్తించిన గ్రాసభలు 175 ఉండగా , పదేళ్ల పైనుంచి ఎన్నికల్లేవ్

వెంటనే పెసా గ్రామసభల ఎన్నికలు జరపాలంటూ ఏజెన్సీ వాసులు డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు జిల్లాలో పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు ఏజెన్సీ ప్రాంతాలుగా ఉన్నాయి. ఈ ఐదు మండలాల్లో 152 రెవెన్యూ గ్రామాలు, 73 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. షెడ్యూల్ గ్రామ పంచాయతీలు 69 వరకూ ఉండగా, ప్రభుత్వం నోటిఫై చేసిన పెసా గ్రామసభలు 175 ఉన్నాయి. ఏజెన్సీ ప్రాంతంలో మొత్తం 28,167 కుటుంబాలు ఉండగా 2011 జనాభా లెక్కల ప్రకారం దాదాపు రెండు లక్షల జనాభా ఉంది. ఏజెన్సీ గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలతోపాటు, ఏ కార్యక్రమం చేయాలన్నా పెసా గ్రామసభల తీర్మానాలు తప్పనిసరి. జనాభా ప్రాతిపదికన ఈ గ్రామ సభలను గుర్తిస్తారు. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వం 175 పెసా గ్రామ సభలను గుర్తించింది. పెసా గ్రామసభలకు ఐదేళ్లకోసారి ఎన్నికలు జరపాల్సి ఉంటుంది. పంచాయతీ సర్పంచి అధ్యక్షుడుగా ఈ పెసా గ్రామసభకు ఉంటారు. ఉపాధ్యక్ష, కార్యదర్శి పదవులకు ఎన్నికలు జరుపుతారు. చేతులు ఎత్తడం ద్వారా ఈ ఎన్నిక ప్రక్రియ పూర్తిచేస్తారు. ఏజెన్సీలో అత్యంత ముఖ్యమైన పెసా గ్రామసభల ఎన్నికలు జరిపి పదేళ్ల పైనే అయ్యింది. పెసా గ్రామసభలు లేకపోవడంతో ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. నాయకులు, అధికారులు ఏజెన్సీ చట్టాలను తుంగలోతొక్కి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో పెసా గ్రామసభ ఎన్నికలు నిర్వహించాలని ఎప్పటి నుంచో గిరిజనులు కోరుతున్నారు. దీంతో ఈ ఏడాది జులై ఒకటో తేదీన ఏజెన్సీలోని షెడ్యూల్ ప్రాంతాల్లో పెసా గ్రామసభల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు జారీచేసి ఆరు నెలలు గడిచిపోతోంది. ఇప్పటివరకూ పెసా గ్రామసభల ఎన్నికలు అధికారులు జరపలేదు. పక్క జిల్లా రంపచోడవరంలో పెసా గ్రామసభల ఎన్నికలను అక్కడి అధికారులు పూర్తిచేసిన పరిస్థితి ఉంది. జిల్లా ఐటిడిఎ అధికారులు మాత్రం పెసా గ్రామసభల ఎన్నికల నిర్వహణపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న పరిస్థితి. అసలు ఎన్నికలు ఎందుకు నిర్వహించడం లేదో ఏ ఒక్కరికీ అర్థంకావడం లేదు. ఏజెన్సీలోని ఎల్‌టిఆర్ భూములతోపాటు, పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన నిర్వాసితుల సమస్యలు అనేకం ఉన్నాయి. రోడ్లు, తాగునీరు వంటి సమస్యలతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెసా గ్రామసభ ఉంటే కనీసం ఏడాదికి రెండు సార్లు సమావేశమై అక్కడి ప్రజల సమస్యలపై చర్చించి ప్రభుత్వానికి తెలిపే అవకాశం ఉంటుంది. పెసా గ్రామసభలు లేకపోవడంతో పదేళ్లుగా అటువంటి పరిస్థితి లేకుండా పోయింది. పెసా గ్రామసభల ఎన్నికలు నిర్వహిస్తే తమ పప్పులు ఉడకవని అక్కడి అధికారులు భావిస్తున్నారా అన్న అనుమానాలు నెలకొన్నాయి. వెంటనే పెసా గ్రామసభల ఎన్నికలు నిర్వహించాలని ఏజెన్సీ ప్రజలతోపాటు, ప్రజాసంఘాలు కోరుతున్నాయి.

జనాలను ఏమార్చేందుకు అవగాహన సదస్సుల డ్రామా..

పెసా గ్రామసభలకు ఎన్నికలు నిర్వహించకుండా అవగాహనా సదస్సుల పేరిట అధికారులు కొత్త డ్రామాకు దిగారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామసభల ఎన్నికలు నిర్వహించి ఎన్నికైన వారికి అవగాహనా సదస్సులు నిర్వహించడం సబబు. అలాకాకుండా అవగాహనా సదస్సులు ఎందుకోసం నిర్వహిస్తున్నారో అర్థంకాని పరిస్థితి నెలకొంది. పెసా గ్రామసభల ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా అవగాహనా సదస్సుల పేరిట కాలక్షేపం చేస్తున్నట్లు చర్చ సాగుతోంది. ఇప్పటికైనా జిల్లా, ఐటిడిఎ అధికారులు గిరిజనులకు అండగా నిలబడాలని, వెంటనే పెసా గ్రామసభల ఎన్నికలు నిర్వహించాలని ఏజెన్సీ వాసులు కోరుతున్నారు.

నేడు, రేపు నరసాపురంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు

ప్రజాశక్తి - నరసాపురం

సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు ఈ నెల 26, 27 తేదీల్లో నరసాపురంలోని అల్లూరి సత్యనారాయణ రాజు సాంస్కృతిక కేంద్రంలో జరుగుతున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు తెలిపారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశాలకు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, ఎంఎ బేబీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరవుతారని తెలిపారు. రాష్ట్ర కమిటీ సమావేశాలు నరసాపురంలో మొదటిసారిగా జరుగుతున్నాయని ప్రజలు ఆదరించాలని వారు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను, ప్రజా అవసరాలను సమావేశంలో చర్చిస్తారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా అవసరాల సాధనకు ఉద్యమ కార్యాచరణ ఈ సమావేశంలో రూపొందిస్తారని తెలిపారు. ఈ నెల 26వ తేదీ గురువారం సాయంత్రం నాలుగు గంటలకు స్వాతంత్ర్య సమరయోధులు జిల్లా కమ్యూనిస్టు పార్టీ నిర్మాత మాజీ పార్లమెంట్ సభ్యులు ఉద్దరాజు రామం పుస్తక ఆవిష్కరణ సభ జరుగుతుందని చెప్పారు. లౌకిక ప్రజాతంత్ర అభ్యుదయ వాదులు, కమ్యూనిస్టు పార్టీ సభ్యులు, సానుభూతిపరులు హాజరుకావాలని వారు విజ్ఞప్తి చేశారు.

డెడ్‌బాడీ డోర్ డెలివరీ కేసులో..
శ్రీధర్‌వర్మకు సహకరించిందెవరు..?

భీమవరం ప్రాంతంలో రహస్యంగా సాగుతున్న పోలీసుల విచారణ

తులసి సోదరి రేవతి పాత్రపైనా అనుమానాలు!

ప్రజాశక్తి - ఉండి

డెడ్‌బాడీ డోర్ డెలివరీ కేసు విచారణలో విస్తుపోయే విషయాలు వెలుగుచూస్తున్నట్లు సమాచారం. ప్రధాన అనుమానితుడు తిరుమాని శ్రీధర్ వర్మకు ఈ ప్రక్రియలో సహకరించిందెవరు అనే దిశగా పోలీసులు లోతుగా విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో శ్రీధర్ వర్మ మూడో భార్యతోపాటు రెండో భార్య, డెడ్‌బాడీ వచ్చిన సాగి తులసి సోదరి రేవతి పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాళ్ల మండలం గాంధీనగరంలో బర్రె పర్లయ్యను హత్య చేసిన తీరు అక్కడ నుంచి పర్లయ్య మృతదేహాన్ని ఎక్కడికి తరలించారో, సాగిపాడు వద్ద ఆటో డ్రైవర్‌కు చెక్క పెట్టె పార్శిల్ ఇచ్చిన మహిళ ఎవరు, పార్శిల్ యండగండిలోని గాదిరాజు రంగరాజు ఇంటికి చేరాక ఎవరు తెరిచారు, ఆ సందర్భంగా రంగరాజు, రేవతి, తులసితో శ్రీధర్ వర్మకు జరిగిన సంభాషణ ఏంటి, పోలీసుల రంగప్రవేశంతో ఎందుకు పరారయ్యారు, పోలీసులు వచ్చిన సమాచారం శ్రీధర్ వర్మకు ఎవరు అందించారు, అక్కడ నుంచి పరారయ్యాక ఎక్కడికి వెళ్లారు అనే అంశాలపై పోలీసులు ప్రధానంగా దృష్టి సారించి విచారణ సాగిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే శ్రీధర్ వర్మ జీవన శైలి, మూడు పెళ్లిళ్లు, నేర చరిత్రపై పోలీసులు పూర్తి స్థాయి సమాచారం సేకరించినట్లు తెలుస్తోంది. డెడ్‌బాడీ డోర్ డెలివరీ కేసులో సాగి తులసి సోదరి రేవతి పాత్రపైనా అనుమానాలు బలపడుతున్నాయి. ప్రధానంగా డెడ్‌బాడీ ఇంటికి చేరాక దాన్ని తెరిచి చూసినప్పటి నుంచి ఆ బాడీని మాయం చేయడానికి రూ.70 లక్షలు ఇవ్వడం లేదా ఆస్తి పత్రాలకు సంబంధించి సంతకాలు చేయాలని తులసిపై ఒత్తిడి చేసిన వారిలో శ్రీధర్‌వర్మకు రేవతి సహకరించినట్లు తెలుస్తోంది. రేవతి శ్రీధర్ వర్మను వివాహం చేసుకోవడం అనంతరం తండ్రి రంగరాజు కొంత ఆస్తిని తులసి, రేవతిలకు పంచారు. మిగిలిన ఆస్తి తనకే ఇవ్వాలని రేవతి, శ్రీధర్‌వర్మ దంపతులు రంగరాజుపై ఒత్తిడి తేగా ఆయన నిరాకరించి చెరి సమానంగానే పంచుతానని స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో శ్రీధర్‌వర్మ డెడ్‌బాడీ డోర్‌డెలివరీ ప్లాన్ సిద్ధం చేసి తద్వారా తులసిని, రంగరాజును బెదిరించి ఆస్తి మొత్తం రేవతి, శ్రీధర్‌వర్మ పేరుమీద రాయించుకునేందు పన్నాగం పన్నినట్లు తెలిసింది. అయితే శ్రీధర్ వర్మ తీరుపై అనుమానం వచ్చిన తులసి బంధువులు, మిత్రులకు సమాచారం ఇవ్వడం, వారి ఇచ్చిన సమాచారంతో పోలీసులు రంగప్రవేశం చేయడం చకచకా జరిగిపోయాయి. పోలీసులు ఇంటికి చేరేటప్పటికి శ్రీధర్‌వర్మ అక్కడ లేరు. పోలీసులు వచ్చిన విషయాన్ని రేవతి సమాచారం అందించడంతో శ్రీధర్ వర్మ పరారైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆటో డ్రైవర్‌కు డెడ్‌బాడీ పార్శిల్ అందించింది రేవతినా, మూడో భార్య లేక మరెవరైనానా అనేదిశగా పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నట్లు తెలిసింది. మరో రెండు రోజుల్లో ఈ కేసు చిక్కుముడి పూర్తిగా వీడే అవకాశం ఉంది.

5 నెలలుగా అందని బిల్లులు..!

కొడమంచిలి జిల్లా పరిషత్ హైస్కూల్లో వంటలు చేస్తున్న మహిళలు

అప్పల్లో మధ్యాహ్న భోజన కార్మికులు

ప్రజాశక్తి - ఆచంట

ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారుల ఆకలి తీరుస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు ఆకలితో అలమటిస్తున్నారు. ఈ పథకం నిర్వాహకులకు గత ఐదు నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంతో వంట ఏజెన్సీల నిర్వాహకులు అల్లాడిపోతున్నారు. విద్యార్థుల కడుపు నింపేందుకు వారు అప్పులు చేస్తూ ముందుకు సాగుతున్నారు. అయితే ఈ ఐదు నెలల్లో అప్పులు కుప్పలుగా పేరుకుపోవడంతో కొత్త అప్పు పుట్టక ఏం చేయాలో అర్థంకాక వంట ఏజెన్సీల నిర్వాహకులు తలలు పట్టుకుంటున్నారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం ఆగిపోయే ప్రమాదం పొంచి ఉంది. ఈ పథకం అమలుకు సంబంధించిన బిల్లులే కాకుండా నిర్వాహకులకు గౌరవ వేతనాలు కూడా అందకపోవడంతో వారి కుటుంబాల పోషణ కూడా భారంగా మారింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం వీరికి సెప్టెంబర్ వరకూ బిల్లులు చెల్లించినట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తున్నా వీరికి మాత్రం బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమ కాలేదని వాపోతున్నారు. అయితే కొన్ని ఏజెన్సీలకు మాత్రం సొమ్ము పడిందని, ఎక్కువ ఏజెన్సీలకు పడలేదని సమాచారం. జూన్ బిల్లు తర్వాత జులై నుంచి ఇప్పటి వరకూ తమకు చిల్లిగవ్వ పడలేదని పలువురు నిర్వాహకులు వాపోతున్నారు. ఆచంట మండలంలో 63 ప్రాథమిక, మూడు ప్రాథమికోన్నత, ఎనిమిది ఉన్నత పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది. ఈ పాఠశాలల్లో సుమారు 120 మంది మహిళలు వంటలు చేస్తున్నారు.

ఐదు నెలలైనా అందని బిల్లులు..

ఈ ఏడాది జులై నుంచి నవంబర్ వరకూ మధ్యాహ్న భోజన బిల్లులతోపాటు గౌరవ వేతనం రావాల్సి ఉంది. ఉన్నత పాఠశాల విద్యార్థుల నిమిత్తం నెలకు సుమారు రూ.55 నుంచి రూ.60 వేల వరకూ ఖర్చవుతోంది. దీన్నిబట్టి చూస్తే మండలంలో మధ్యాహ్న భోజన కార్మికులకు సుమారు రూ.ఐదు కోట్ల వరకూ ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. గౌరవ వేతనం కూడా సుమారు రూ.రెండు కోట్లు వరకూ రావాల్సి ఉంది. ఒకపక్క నిత్యావసర సరుకులు, వంటనూనె, గ్యాస్‌ధరలు విపరీతంగా పెరగడంతో నిర్వహణ మరింత భారమైంది.

అప్పల పాలవుతున్నాం..

దొమ్మేటి అనంతలక్ష్మి, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు, జక్కంశెట్టివారిపాలెం

నెలల తరబడి బిల్లులు అందకపోవడంతో అప్పు చేసి పిల్లలకు వండి పెడుతున్నాం. ఇక వంటలు చేయడం కష్టంగా మారింది. ప్రభుత్వం స్పందించి బిల్లులకు నిధులు మంజూరు చేయాలి. సన్‌ఫ్లవర్ నూనె, ఆర్గానిక్ బెల్లం, అయోడైజ్డ్ ఉప్పు వాడాలని అధికారులు చెబుతున్నారు. బిల్లుల గురించి మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదు.

చాలా కష్టంగా ఉంది..

తమ్మినీడి సత్యవతి, కొడమంచిలి మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు

సకాలంలో బిల్లులు అందకపోవడంతో మధ్యాహ్న భోజనం నిర్వహణ మాకు కష్టంగా ఉంది. ఎన్నడూ లేనివిధంగా నెలల తరబడి బిల్లులు విడుదల కాకపోవడంతో బయట వ్యక్తుల వద్ద వడ్డీకి సొమ్ము అప్పు తెచ్చి విద్యార్థులకు వండి పెడుతున్నాం. సరుకులు కొనడానికి డబ్బుల్లేక పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. తక్షణం అధికారులు స్పందించి మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు విడుదల చేయాలి.

'భవ్య భీమవరం'తో అభివృద్ధి

జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

'భవ్య భీమవరం' పేరిట భీమవరంలో మౌలిక వసతుల అభివృద్ధికి శరవేగంగా పనులు ప్రారంభించినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్, మున్సిపాల్టీ స్పెషల్ ఆఫీసర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం భీమవరంలోని నాలుగు ప్రాంతాల్లో మూడు పార్కుల అభివృద్ధి పనులు, భీమవరం పాత బస్టాండ్ నూతన కాంప్లెక్స్ ఏర్పాటు పనులకు జెసి శంకుస్థాపనలు చేశారు. తొలుత కాస్మో క్లబ్ వద్ద వంశీకృష్ణ నగర్‌లో నూతన పార్కు ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. పార్కు ఏర్పాటుకు కాస్మో పోలిటన్ క్లబ్ ప్రెసిడెంట్ అల్లూరి పద్మరాజు నిధులను సమకూర్చనున్నారు. ఎఎస్ఆర్ వాటర్ ట్యాంక్ పార్కులో అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ పార్కు అభివృద్ధికి ఎఎస్ఆర్ సేవా సమితి, దాతలు నిధులు సమకూర్చనున్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని ఆదిత్య కళావేదిక పార్కులో మౌలిక వసతుల అభివృద్ధికి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సామంతపూడి శ్రీ రామరాజు నిధులను సమకూర్చనున్నారు. శంకుస్థాపనల అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కలెక్టర్ చదలవాడ నాగరాణి సారథ్యంలో అధికారులు, దాతలు తొలి అడుగు వేశారని తెలిపారు. జిల్లా కలెక్టర్ భీమవరం అభివృద్ధికి నిరంతరం ఆలోచించి అధికారులను, దాతలను ప్రోత్సహిస్తూ ఇప్పటికే పలు దఫాలుగా సమావేశపర్చి చర్చించినట్లు తెలిపారు. దాని ఫలితంగా నేడు తొలి విడతలో నాలుగు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులకు 'భవ్య భీమవరం' పేరును జిల్లా కలెక్టర్ స్వయంగా ఖరారు చేసి ప్రోత్సహించినట్లు తెలిపారు. ఇది తొలివిడత మాత్రమేనని పనులు కొంత పురోగతికి వచ్చిన తర్వాత మరిన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకోవడానికి ప్రణాళికలను సిద్ధం చేసినట్లు తెలిపారు. రెండో దశలో ప్రకాశంచౌక్, అంబేద్కర్‌చౌక్, ఈట్ స్ట్రీట్, ఖాళీ ప్రాంతాల్లో పచ్చదనం అభివృద్ధి, జువ్వలపాలెం రోడ్డు ఎస్ఆర్‌కె కాలేజీ వరకూ తదితర అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వమే అన్ని అభివృద్ధి కార్యక్రమాలూ చేపట్టాలంటే సాధ్యం కాదని, దాతలు, ప్రజలు భాగస్వామ్యం ఎంతైనా అవసరమని తెలిపారు. అనంతరం భవ్య భీమవరం టైటిల్‌ను జెసి ప్రారంభించారు. పలువురు దాతలు సామంతపూడి శ్రీరామరాజు, విశ్వనాథరాజు, సిహెచ్ కృష్ణంరాజు, సరిపిడకల రామారావు, కంతేటి వెంకటరాజు మాట్లాడుతూ అధికారులకు విజన్ ఉంటే మంచి పరిపాలన జరుగుతుందన్నారు. నేడు మా అందరిని ప్రోత్సహించి మా ప్రాంతాల అభివృద్ధికి దోహదపడుతున్న జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జెసి రాహుల్ కుమార్‌రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమాల్లో కాస్మోపాలిటన్ క్లబ్ ప్రెసిడెంట్ అల్లూరి పద్మరాజు, ఆనంద ఫౌండేషన్ ఛైర్మన్ కాశీ విశ్వనాథరాజు, లైన్ ఇంటర్నేషనల్ సిహెచ్ కృష్ణంరాజు, రామభద్రరాజు టెస్ట్ అధ్యక్షులు చేకూరి రామభద్రరాజు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సామంతపూడి శ్రీరామరాజు, తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు - మార్టేరు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

రహదారుల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి

చంద్రబాబు సహకారంతో వాడవాడకూ సిమెంట్ రోడ్డు వేశాం

జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు



రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించిన మంత్రి రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని ఉల్లంపర్రు గ్రామంలో బుధవారం ఆర్అండ్‌బి శాఖ ఆధ్వర్యంలో చేపట్టే రూ.25 కోట్లతో పాలకొల్లు-మార్టేరు రోడ్డు విస్తరణ, పటిష్ట పరచు పనులకు భూమి పూజలు చేసి, ప్రొక్లైన్‌ను డ్రైవ్ చేస్తూ లాంఛనంగా పనులను మంత్రి రామానాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ జగన్ గత ఐదేళ్ల పాలనలో చేసిన తప్పులు, పాపాలను ఒప్పుకొని పశ్చాతాపంతో ప్రజలకు క్షమాపణ చెప్పాలని అన్నారు. తన ఆస్తులను పెంచుకునేందుకు, ప్రజల ఆస్తులను దోచుకునేందుకే వచ్చే జనవరి నుంచి ప్రజల్లోకి వస్తానని చెబుతున్నాడన్నారు. జగన్ రాక్షస పాలనకు ప్రజలు చరమగీతం పాడి 11 సీట్లకే పరిమితం చేసినా ఇంకా బుద్ధి రాలేదన్నారు. ఏ ప్రాంతం అయినా వ్యవసాయ, పారిశ్రామిక రంగం, శాంతి భద్రతలతో పాటు రహదారులు అభివృద్ధి చెందితేనే ప్రాంతాలు, రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. చంద్రబాబు నాయుడు హయాంలో ఇంటింటికీ, వాడవాడకు సిమెంటు రోడ్లు వేసి అభివృద్ధి చేశామన్నారు. గ్రామాల నుంచి మండలాలకు, జిల్లాలకు అనుసంధానం చేస్తూ రహదారులకు చంద్రబాబు ఎంతో అభివృద్ధి చేశారు. ఆనాడు ఎటుచూసినా సిమెంటు రోడ్డులతో గ్రామాలు కలకలలాడేవని మంత్రి తెలిపారు. ఆనాడు ప్రధాన మంత్రి అటల్ బీహారీ వాజ్‌పాయ్ సహకారంతో, చంద్రబాబు కృషితో రాష్ట్రంలో నాలుగు లైన్లు, ఆరు లైన్లను జాతీయ రహదారులను ఎంతో అభివృద్ధి చేశారు. విశాఖపట్నం వెళ్లాలంటే 12 గంటల నుంచి 14 గంటల సమయంతో పాటు హోటల్స్ వద్ద రెండు పర్యాయాలు ఆగి భోజనం చేయవలసి వచ్చేది. జాతీయ రహదారులు అభివృద్ధితో విశాఖపట్నంకు 6 గంటలు, హైదరాబాద్‌కు 7 గంటల లోపుగా చేరుకుంటున్నామని అన్నారు. రాష్ట్రంలో గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రతి జిల్లాలో పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, సంక్రాంతి లోపుగా ప్రమాదం లేని ఆరోగ్యకరమైన రహదారులుగా తీర్చిదిద్దుతామన్నారు. దురదృష్టవశాత్తు ఒక్క ఛాన్స్‌తో గత ఐదేళ్లుగా అన్ని వ్యవస్థలతో పాటు రహదారుల వ్యవస్థ చిన్నాభిన్నంగా తయారయ్యాయని అన్నారు. గత ఐదు సంవత్సరాల పాలనలో అధ్వాన రోడ్లతో ప్రమాదాలకు గురై ఆసుపత్రి పాలవడం, వాహన మరమ్మతులకు జేబులు గుల్లవడం, పాలకొల్లులో ఏడు మంది మరణించారని తెలిపారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు తోడుగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉన్నారని, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారంతో, కేంద్ర నిధులను పెద్ద ఎత్తున తీసుకొస్తున్నారని మంత్రి నిమ్మల అన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి మాజీ సభ్యులు అంగర రామ్మోహన్, ఆర్అండ్‌బి శాఖ డిఇ బివి.రమణ, సహాయ సంచాలకులు డిఎస్ఎన్.మూర్తి, నాయకులు గండేటి వేంకటేశ్వరరావు, ఉన్నమట్ల కబర్ధి, కర్నేని గౌరు నాయుడు, పాసర్ల వెంకటరమణ, మద్దాల రాంబాబు, బొడ్డు శ్రీను పాల్గొన్నారు.

వీడని ముసురు

పెరిగిన చలిగాలులు

ఎగసిపడుతున్న సముద్ర కెరటాలు



నరసాపురం :ఉధృతంగా ఎగిసిపడుతున్న సముద్రం అలలు

ప్రజాశక్తి - నరసాపురం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో నాలుగు రోజుల నుంచి తీర ప్రాంతంలో చలిగాలులు పెరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం మబ్బులతో, తీవ్రమైన గాలులతో ప్రజలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ఇటు బుధవారం రోజు కూడా వాతావరణం ముసురేసింది. అడపాదడపా వర్షం చినుకులు కురుసాయి. గాలులకు సముద్రంలో అలలు ఎగసిపడుతున్నాయి. సముద్ర తీర ప్రాంతాల్లో చలి ప్రభావం మరింత ఎక్కువగా కనిపించింది. సాయంత్రం గాలలు తీవ్రత పెరగడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. పగలు సైతం ఉన్ని దుస్తులు ధరించి ప్రయాణాలు చేస్తున్నారు. అల్పపీడన ప్రభావంతో గత వారం రోజులుగా వేట జరగడం లేదు. దీంతో మత్స్యకారులకు ఉపాధి కరువైంది. ఎండ లేకపోవడంతో అక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో రెండు రోజులు వాతావరణం ఇదే విధంగా ఉంటే సాగు నష్టపోయే ప్రమాదం ఉందని భయందోళన చెందుతున్నారు.

ప్రేమతో జీవించడం క్రిస్మస్ సందేశం

మాజీ మంత్రి, రాష్ట్ర వినియోగదారుల ప్రొటెక్షన్ కౌన్సిల్ ఛైర్మన్ పీతల సుజాత

క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న పీతల సుజాత

వీరవాసరం : అజ్ఞానాన్ని పోగొడదాం.. శత్రుత్వం వదిలేద్దాం.. ప్రేమతో జీవించడం ఇదే క్రిస్మస్ యొక్క సందేశం అని మాజీ మంత్రి, రాష్ట్ర వినియోగదారుల ప్రొటెక్షన్ కౌన్సిల్ ఛైర్మన్ పీతల సుజాత అన్నారు. క్రిస్మస్ వేడుకలను పీతల సుజాత ఇంటి వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేసి కేకు కోశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని చంద్రశేఖర్, జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్ నాయుడు, వేండ్ర వెంకట కృష్ణ, రాయపల్లి వెంకట్, మల్ల శ్రీరామ్మూర్తి, గెడ్డం భాస్కర్ రావులు పాల్గొన్నారు.

అన్నదానానికి శ్రీదేవి ట్రస్ట్ సాయం

ప్రజాశక్తి - కాళ్ల

అన్న సమారాధనకు దాట్ల శ్రీదేవి ట్రస్టు అధినేత డాక్టర్ దాట్ల వెంకట రామరాజు సాయం అందించేందుకు ముందుకు వచ్చారు. కాళ్లకూరు గ్రామంలో సాగర్ల పేటలో ఉన్న చర్చికి క్రిస్మస్ ఆరాధన అన్న సమారాధన నిమిత్తం దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ దాట్ల వెంకటరామరాజు ముందుకు వచ్చి 50 కేజీల చికెన్‌ను పాస్టర్ సురేష్ బాబుకు ట్రస్ట్ సభ్యులు పెన్మెత్స నాగరాజు చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ఈ అన్న సమారాధనకు 700 లీటర్ల ఆర్వో వాటర్‌ను అందించారు. 125 కమలా పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెరుమాళ్ల దుర్గారావు, తాడిశెట్టి రాజు, తాడిశెట్టి రాజేష్ పాల్గొన్నారు.

చికెన్‌ను అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

డ్రెయినేజీలో పూడికతీత

ప్రజాశక్తి - కాళ్ల

జువ్వలపాలెం గ్రామంలో తూర్పుపేట, గోకరాజు నరసింహరాజు నగర్ ప్రాంతాల్లో డ్రెయినేజీ చాలా కాలంగా పూడుకుపోయి, మురుగునీరు సరిగ్గా వెళ్లకపోవడంతో అపరిశుభ్రంగా ఉంది. ఈగలు, దోమలు చేరి దుర్వాసన వెదజల్లుతుంది. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. దీంతో బుధవారం గ్రామ సర్పంచి మీసాల రమణ, గ్రామ కార్యదర్శి పోలయ్య ఆదేశాలతో డ్రెయినేజీలో పేరుకుపోయిన సిల్ట్ తీసే పనులు చేపట్టారు. డ్రెయినేజీలో ఉన్న చెత్తను పూర్తిగా తొలగించి శుభ్ర పరిచారు. ఎంపిటిసి మీసాల శ్రీనివాస్ పర్యవేక్షణలో డ్రెయినేజీలో పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించి, డ్రెయినేజీని శుభ్రపరచడంతో సమస్య పరిష్కారమైంది. ఎప్పటి నుంచో ఉన్న సమస్య పరిష్కారం కావడం పట్ల తూర్పు, గోకరాజు నరసింహరాజు నగర్ పరిసర ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా వాజ్‌పేయ్ జయంతి

ప్రజాశక్తి - నరసాపురం

దేశంలో నాలుగు లైన్ల రహదార్లను అభివృద్ధి చేసిన ఘనత కీర్తిశేషులు ప్రధాని వాజ్ పేయ్‌కు దక్కిందని బిజెపి నియోజకవర్గ కన్వీనర్ మేకల సతీష్ అన్నారు. వాజ్‌పేయ్ జయంతిని పురస్కరించుకొని బుధవారం అంబేద్కర్ సెంటర్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, మాట్లాడారు. ప్రధానిగా వాజ్‌పేయ్ చేపట్టిన సంస్కరణల వల్ల నేడు దేశంలోని మారుమూల ప్రాంతాలకు కూడా జాతీయ రహదార్లు విస్తరించాయన్నారు. వాజ్‌మేయ్ చేపట్టిన ఈ అభివృద్ధి చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో మునికోట వెంకటేశ్వరరావు, సత్యకృష్ణ, రావూరి ప్రసాద్, విశ్వప్రతాప్, వనమాల శ్రీనివాస్, గునిశెట్టి శ్రీనివాస్, ఈశ్వర్, వెంకట్ పాల్గొన్నారు.

మాధవనాయుడుకు పలువురి పరామర్శ

ప్రజాశక్తి - నరసాపురం

మాజీ ఎంఎల్ఎ మాధవ నాయుడు కుటుంబాన్ని మంత్రి నిమ్మల రామానాయుడు పరామర్శించారు. బుధవారం నరసాపురం మండలం సరిపల్లి గ్రామంలో మాజీ శాసనసభ్యులు బండారు మాధవ నాయుడు, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మంత్రి రామానాయుడు, భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు ప్రగాఢ సానుభూతి తెలిపి, ధైర్యం చెప్పారు. ఇటీవల మృతి చెందిన మాధవ నాయుడు తండ్రి వీర సూర్య సత్య ప్రతాప్ నాయుడు చిత్రపటానికి పూలమాలలను వేసి మంత్రి ఘనంగా నివాళులర్పించారు. ప్రతాప్ నాయుడు మృతి తీరని లోటని, సర్పంచిగా సరిపల్లి గ్రామానికి చేసిన సేవలు ప్రశంసనీయమని అన్నారు. మాధవనాయుడు, కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని ఇవ్వాలని మంత్రి కోరారు. తన తండ్రి జ్ఞాపకాలను మంత్రి రామానాయుడుతో బండారు మాధవనాయుడు గుర్తు చేసుకున్నారు. మంత్రితో పాటు మాజీ శాసనమండలి ఛైర్మన్ అంగర రామ్మోహన్, బండారు పటేల్ నాయుడు, కొండేటి శ్రీను, రేవు ప్రభుదాస్, పులపర్తి దత్తు, రేఖపల్లి సురేష్ పాల్గొన్నారు.

బొబ్బిలికి పురస్కారం

ప్రజాశక్తి - ఆకివీడు

వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర సహధ్యక్షులు బొబ్బిలి బంగారయ్యను మరో పురస్కారం వరించింది. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా కలెక్టరేట్లో జరిగిన కార్యక్రమంలో వినియోగదారులకు ఉత్తమ సేవలందించినందుకుగాను ఆయనను పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వెంకటేశ్వర్లు, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి ఎ.సరోజ, మేనేజర్ శివప్రసాద్, శ్రీరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

కంటైనర్‌ను సీజ్ చేయాలని ఆందోళన

ప్రజాశక్తి - తణుకు రూరల్

గొడ్డుమాంసం తరలిస్తున్న కంటైనర్‌ని సీజ్ చేసి మాంసం తరలింపును అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ తేతలి గ్రామానికి చెందిన మహిళలు బుధవారం తణుకు రూరల్ పోలీస్ స్టేషన్ దగ్గర ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే తణుకు మండలం తేతలి పరిధిలో ఉన్న లేహం ఫుడ్స్ లోపల నుంచి మాంసం లోడుతో వస్తున్న కంటైనర్‌ని స్థానిక మహిళలు అడ్డుకున్నారు. వాహనాన్ని అక్కడే వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు. దీంతో మహిళలు పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. అనంతరం కంటైనర్‌ను పోలీస్ స్టేషన్ వద్దకు తరలించారు. వాహనంలో మాంసం నుంచి వచ్చిన వేస్టేజీని వైజాగ్ తరలిస్తున్నట్లు యాజమాన్యం పోలీసులకు తెలియజేశారు. అంతేకాకుండా అన్ని అనుమతులు ఉన్నట్లు వివరించారు. మాంసంతో ఉన్న వాహనం కావడంతో పోలీసులు వాహనం వైజాగ్ వెళ్లేందుకు అనుమతించారు. అక్కడే ఉన్న గ్రామానికి చెందిన స్థానిక మహిళలు వాహనాన్ని ఎలా వదులుతారు అని పోలీస్ స్టేషన్ సమీపంలో రోడ్డుపై బైఠాయించి వాహనాన్ని కొద్దిసేపు అడ్డుకోవడంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. తణుకు రూరల్ ఇన్‌ఛార్జి ఎస్ఐ జానా సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మాంసానికి సంబంధించిన శాంపిల్స్‌ను సేకరించారు.

నేరాలు - ఘోరాలు

ట్రక్ ఆటో ఢీ : యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని నత్తారామేశ్వరం శివారు పంపనవారి పాలెం ఎస్ఆర్ పెట్రోల్ బంకు వద్ద ట్రక్ ఆటో మోటార్ సైకిల్‌పై వెళుతున్న యువకుడ్ని బలంగా ఢీకొనడంతో పెనుమంట్ర గ్రామానికి చెందిన గుబ్బల వెంకటేశ్వరరావు(23) అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పెనుమంట్ర 108 అత్యవసర వాహనానికి సమాచారం అందించగా సమాచారం అందుకున్న వాహన సిబ్బంది వెళ్లేసరికి అప్పటికే యువకుడు మృతిచెందాడు. ఎమర్జెన్సీ టెక్నీషియన్ బాలకృష్ణ ఫైలెట్ బ్రహ్మాజీ సాకారంతో సిపిఆర్ ప్రక్రియ చేసినప్పటికీ ఎటువంటి స్పందన లేదు. 108 సిబ్బంది పరిశీలించగా అక్కడ భయంకర దృశ్యాలు కనిపించాయి. మృతుని తల పగిలి మెదడు బయటకు వచ్చి కొంత దూరంలో పడడంతో అక్కడ ఉన్న జనాలు ఒక్కసారిగా భయాందోనాలకు గురయ్యారు. అంతేకాకుండా మృతిని కాలు కూడా నుజ్జయింది. స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రక్షణ వలయానికి చిక్కుకుని ఏటిపిల్లి మృతి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లిలో ఆక్వా రైతు చెరువుగట్టు వద్ద ఏర్పాటు చేసిన రక్షణ వలయానికి ఏటిపిల్లి బుధవారం చిక్కుకుని మృతి చెందింది. ఆ ప్రాంతంలోని ఉప్పుటేళ్లలో ఏటి పిల్లులు నివసిస్తున్నాయి. వాటి నుంచి చెరువుల్లోని చేపల రక్షణకు రైతులు కంచె ఏర్పాటు చేసుకున్నారు. ఆ కంచికి ఏటిపిల్లి చిక్కుకుని మృతి చెందింది.

రామన్నపాలెంలో రెండు తలల పాము

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని రామన్నపాలెం పంచాయతీ పులపర్తివారి తోటలో ఇంటి ప్రహరీ గోడ నుంచి రెండు తలల పాము బయటకు వచ్చి హల్చల్ చేసింది. దీనిని గమనించిన ఇంటి యజమాని యాతం పాండు రంగారావు, సమీప నివాసితులు రెండు తలల ఉన్నపాముగా గుర్తించారు. స్థానికులు తోట సుబ్బారావు, యర్రా రామకృష్ణ తదితరులు చూసి, కర్రలతో బెదిరించి, పాము కదలికలను నిలుపుదల చేశారు. స్థానికులకు రెండు తలల పామును చూసేందుకు ఆసక్తి కనబరిచారు. అనంతరం గ్రామంలో పాములు పట్టే వ్యక్తి వచ్చి ఆ పామును పట్టుకుని సురక్షిత ప్రాంతంలో వదిలారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ప్రాతళ్లమెరక పంచాయతీ అభివృద్ధే లక్ష్యం

మంచినీటి చెరువు చుట్టూ పచ్చని మొక్కలు

గ్రామంలో ఒకే చోట నిర్మించిన ప్రభుత్వ భవనాల సముదాయం

రూ.20 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులు

ప్రజాశక్తి - కాళ్ల

ప్రాతళ్లమెరక పల్లెను అభివృద్ధి పరచాలనే లక్ష్యంతో ప్రభుత్వ నిధులు, ప్రముఖ దాత వేగిరాజు శివవర్మ ఆర్థిక సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని టిడిపి గ్రామ అధ్యక్షుడు కంతేటి శ్రీనివాసరాజు పేర్కొన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. దాతలు, అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో పనిచేసి, బాధ్యతలను సక్రమంగా నిర్వహించడంతో గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందాయన్నారు. తన ఊరిని అభివృద్ధి చేయాలని తలంపుతో 1996లో వేగిరాజు శివవర్మ తన సోదరి లక్ష్మి మెమోరియల్ ట్రస్టును ఏర్పాటు చేసి గ్రామ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తున్నారన్నారు. తాను పుట్టిన ఊరికి ఏదో ఒకటి చేయాలన్న లక్ష్యంతో వ్యాపారంలో కొంత భాగాన్ని ఊరికి కేటాయిస్తున్నారన్నారు. గ్రామంలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నానన్నారు. ప్రాతళ్లమెరక గ్రామపంచాయతీలో ప్రభుత్వ నిధులు, దాతలు, గ్రామాభివృద్ధి కమిటీల సహకారంతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. మైనర్ పంచాయతీ కావడంతో ఆదాయం అంతంత మాత్రమే. దీంతో గ్రామ సర్పంచి కంతేటి ఉష, కంతేటి శ్రీనివాసరాజు, ఆమె భర్త ఉప సర్పంచి కంతేటి చంద్రావతి, కంతేటి సుబ్బరాజు, ప్రముఖ దాత వేగిరాజు శివవర్మల ప్రత్యేక శ్రద్ధ, ఆర్థిక సహకారంతో గ్రామంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులు చేపట్టామన్నారు. ఒకేచోట భవనాల సముదాయాలు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలు అవసరాల కోసం సుదూర ప్రాంతాల్లోకి వెళ్లనవసరం లేకుండా అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో సచివాలయం, ప్రజలకు వైద్య, రైతులకు రైతు భరోసా కేంద్రం నిర్మాణాలు చేపట్టారన్నారు. భవన నిర్మాణానికి ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.40 లక్షలు, రైతు భరోసా కేంద్రానికి రూ.21.80 లక్షలు, హెల్త్ క్లినిక్ భవన నిర్మాణానికి రూ.14.95 లక్షలు భవన నిర్మాణ పనులు చేపట్టానన్నారు. ప్రాతళ్ల మెరక మంచినీటి చెరువు చుట్టూ రిటైనింగ్ వాల్ నిర్మాణం చేయడంతో, పచ్చని మొక్కలు నాటడంతో ఆనందకరంగా, ఆహ్లాదకరంగా ఉన్నాయన్నారు. మినీ ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులు రూ.20 లక్షలతో 40 వేల లీటర్ల కెపాసిటీ గల ట్యాంక్ నిర్మాణం చేపట్టామన్నారు. మంచినీటి చెరువు చుట్టూ వివిధ రకాల క్రోటన్ మొక్కలు శివవర్మ ఆర్థిక సహకారంతో మొక్కలు నాటమన్నారు. శివవర్మ తండ్రి వేగిరాజు సుబ్బరాజు జ్ఞాపకార్థంగా సుజల వాటర్ ప్లాంట్ నిర్మించారు. సోదరి పేరున విజయలక్ష్మి మెమోరియల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి, పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ప్రజలకు సురక్షిత నీరందించేందుకు రక్షిత మంచినీటి ఫిల్టర్ బెడ్, చెరువుని అభివృద్ధి చేయడం, పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టామన్నారు. అదనపు ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులు రూ.20 లక్షలతో 40 వేల లీటర్ల కెపాసిటీ గల ట్యాంక్ నిర్మాణం చేపట్టామన్నారు. కడియపులంక నుంచి మొక్కలను దిగుమతి చేసుకొని ప్రభుత్వ భవనాలు, క్రీడా మైదానాలు, పార్కుల వద్ద వివిధ మొక్కలు నాటామన్నారు. ప్రాతళ్లమెరక గ్రామానికి చెందిన కనుమూరి రామకృష్ణంరాజు, కనుమూరి గోపాలకృష్ణంరాజులు విరాళంగా ఇచ్చిన 50 సెంట్ల స్థలంలో గ్రామ సచివాలయం, హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలు నిర్మించామన్నారు. మంతెన సుందర రామ రాజు, సూర్యకాంతమ్మ జ్ఞాపకార్థంగా కాంస్య విగ్రహ ఆవిష్కరణ, గౌతమ బుద్ధుడు, కాటన్ దొర, అంబేద్కర్, స్వామి వివేకానంద, పొట్టి శ్రీరాములు, అల్లూరి సీతారామరాజు, మహాత్మా గాంధీ విగ్రహాలు ఏర్పాటు చేశామన్నారు. మాజీ సర్పంచి కనుమూరి సూర్యనారాయణరాజు జ్ఞాపకార్థంగా 76 అడుగుల కాంస్య విగ్రహాన్ని, గ్రామ సచివాలయ భవనాన్ని, హెల్త్ క్లినిక్ భవనాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని, రక్షిత మంచినీటి ట్యాంకు, రెండు ఫిల్టర్ బెడ్, సంపూ, పంపు హౌస్, కనుమూరి వెంకట నరసమ్మ వాటర్ ప్లాంట్‌ను నిర్మించామన్నారు. బస్ సెంటర్, దాట్ల పద్మ సుందరి జ్ఞాపకార్థంగా సమావేశ మందిరాన్ని, ప్రభుత్వ ఉద్యోగులకు ప్లేగ్రౌండ్, క్యాంటీన్, చిన్న పేట ప్రాంతంలో ఏడున్నర సెంట్ల స్థలంలో బాలికల క్రీడా ప్రాంగణం, 20 సెంట్ల స్థలంలో బాలుర క్రీడా ప్రాంగణం, పల్లిపాలెం ప్రాంతంలో 65 సెంట్ల స్థలంలో క్రీడా ప్రాంగణం, పెద్దపేటలో 65 సెంట్ల స్థలంలో క్రీడా ప్రాంగణాలు కేటాయించామన్నారు. మంచినీటి చెరువు చుట్టూ, ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో, క్రీడా ప్రాంగణాలలో పచ్చని మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించామన్నారు. గ్రామంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, జన్మభూమి మమకారంతో చదువుకున్న పాఠశాలకు సాయం చేయాలనే ఉద్దేశంతో గత ఆరేళ్ల నుంచి విద్యార్థులకు సామగ్రిని తన వంతుగా సాయం అందిస్తున్నానన్నారు. కాన్వెంట్ విద్యకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్యను అందిస్తున్నారన్నారు.

ఒకే చోట నిర్మించిన భవనాల సముదాయం

మంచినీటి చెరువు చుట్టూ ఉన్న పచ్చని మొక్కలు

కంతేటి శ్రీనివాసరాజు, టిడిపి గ్రామ అధ్యక్షుడు, ప్రాతళ్లమెరక

ఊరూవాడా క్రిస్మస్ సందడి

ప్రజాశక్తి - కాళ్ల

భిన్నత్వంలో ఏకత్వాన్ని ఐక్యంగా ఉండటాన్ని, సంతోషాన్ని, ఆనందాన్ని ఇతరులతో పంచుకోవాలని పండుగ నేర్పుతుందని ఏలూరుపాడు ఏసుక్రీస్తు ప్రార్థన మందిరం పాస్టర్ ఎండి ఇస్మాయేలు అన్నారు. బుధవారం ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి క్రైస్తవ కుటుంబాలు ఎంతో భక్తి శ్రద్ధలతో ఉత్సాహంగా పండుగను జరుపుకున్నారు. మండలంలో ఉన్న ప్రధానమైన చర్చిలు క్రిస్మస్ వెలుగుల్ని సంతరించుకున్నాయి. అన్ని ప్రార్థనా స్థలాలు విద్యుత్ దీప కాంతులతో, క్రిస్మస్ ట్రీ వెలుగులతో నిండి ఉన్నాయి. ఈ ఏడాది క్రిస్మస్ వెలుగుల్లో పండుగను క్రైస్తవ కుటుంబాలన్నీ భక్తి శ్రద్ధలతో ఉత్సాహంగా, ఉల్లాసంగా నిర్వహించుకున్నారు. ఈ పండుగ సందర్భంగా వస్త్రదుకాణాలు, ఫ్యాన్సీ దుకాణాలు, బేకరీలు, హోటళ్లు తదితర వ్యాపార సంస్థలు కస్టమర్లకు ఆఫర్లు ప్రకటించాయి. క్రిస్టల్, ఎల్ఇడి లైట్లు, స్టార్స్, క్యాండిల్స్, గ్రీటింగ్స్ కార్డులు, క్రిస్మస్ ట్రీలు సిద్ధం చేశారు. కొన్ని చర్చిల ముందు ఏసుక్రీస్తు జన్మదిన వృత్తాంతాన్ని చాటే విధంగా పశువుల పాక, సాంబ్రాణి, గొల్లలు, జ్ఞానులు కృత్రిమ బొమ్మలు ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు.

ఆచంట : లోక రక్షకుడు ఏసు క్రీస్తు ప్రభువ వల్లే ప్రతి ఒక్కరూ శాంతి, సహనంతో ప్రపంచ శాంతికి బాటలు వేయాలని రెవరెండ్ ఎస్.ప్రేమ రాజు అన్నారు. బుధవారం ఆచంట క్రీస్తు ప్రార్థనా మందిరంలో అంగరంగ వైభవంగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చిన్నారులు భారీ కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో క్రీస్తు సంఘం సువార్తకులు గాదిరాజు తిమోతి రాజు మాట్లాడుతూ ప్రేమ, కరుణ, దయ సందేశాలతో ప్రభువైన ఏసుక్రీస్తు లోకానికి కొత్త మార్గాన్ని చూపారని అన్నారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని కిస్మస్ వేడుకలను వాడవాడలా ఘనంగా నిర్వహించారు. మండలంలో ఆచంట, కొడమంచిలి, పెదమల్లం, కోడేరు, అయోధ్య లంక, కందరవల్లి, కరుగోరుమిల్లి, భీమలాపురం, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం, శేషమ్మ చెరువు గ్రామాల్లో ఉన్న ప్రార్థనా మందిరాలు విద్యుత్ కాంతులతో లీనుతున్నాయి. ఈ సందర్భంగా క్రైస్తవ సోదరులు క్రిస్మస్ సంబరాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. వివిధ గ్రామాల్లో ప్రధాన కూడల్లు, చర్చిల వద్ద ఏర్పాటు చేసిన క్రిస్మస్ స్టార్, క్రిస్మస్ ట్రీలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు రెవరెండ్ డాక్టర్ బి.డేవిడ్ రాజు, పారుపల్లి యేసురత్నం, నక్కసన్నీ బాబు, మట్ట ఆనంద్ కుమార్, పొలుమూరి శేఖర్ బాబు పాల్గొన్నారు.

ఉండి : మండలంలోని అన్ని గ్రామాల్లోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉండి సెయింట్ పాల్ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో చర్చి ఆవరణ నుంచి ఉండి మెయిన్ సెంటర్ వరకు బుధవారం తెల్లవారుజాము నుంచి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పాస్టర్ మానుకొండ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ లోక రక్షణార్థం ఏసు జన్మించాడని, యేసు చూపిన మార్గంలోనే ప్రతి ఒక్కరూ పయనించాలని తెలిపారు. సర్వ మానవాళి పాపపరిహారార్థం పరిశుద్ధుడైన ఏసుక్రీస్తు జన్మించాడని ఆయన వివరించారు. అనంతరం సహపంక్తి భోజనాలు నిర్వహించారు. ఈ వేడుకలలో సంఘ సభ్యులు, సంఘస్తులు, స్త్రీల సమాజం సభ్యులు, యూత్ సభ్యులు, సండే స్కూల్ బాలలు పాల్గొన్నారు.

పెనుగొండ : మండలంలో గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. క్రీస్తు దేవాలయాల వద్ద క్రైస్తవ సోదరులు ప్రార్థనలు, తెల్లవారుజాము నుంచే జన్మదిన గీతాలతో ఏసుక్రీస్తుని స్మరిస్తూ పెద్ద ఎత్తున జరుపుకున్నారు. చర్చిల వద్ద పశువుల పాకలను సుందరంగా అలంకరించి, క్రీస్తు జననం కళ్లకు కట్టినట్లుగా ఏర్పాటు చేశారు. బుధవారం మండలంలోని సిద్ధాంతం సెయింట్ థామస్ లూథరన్ చెరువు పేట సంఘం ఆధ్వర్యాన మంగళవారం రాత్రి ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలలో విజయవాడ ఇంటిలిజెన్స్ డిఎస్‌పి చింతపల్లి రవికాంత్ పాల్గొని క్రిస్మస్ గ్రీటింగ్స్ ఇచ్చారు. రేవ బి.ప్రేమ్ కుమార్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ నియోజకవర్గంలోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొంటారని, ఆయా గ్రామాల్లోని బుధవారం సాయంత్రం క్రైస్తవసంఘ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల్లోని గ్రామ సర్పంచులు, నక్క శ్యామల సోనీ శాస్త్రి, చింతపల్లి గనిరాజు, నెల్లూరు సత్యనారాయణ, చింతపల్లి జేమ్స్ ఎంపిటిసిలు క్రిస్మస్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. బ్రదర్ డేవిడ్ రాజు, పాస్టర్ ప్రసాద్ నేలపూడి, బ్రదర్ ఈద రమేష్ వారు క్రీస్తు సందేశాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా క్యాండిల్ సర్వీస్ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇలపర్రు సెయింట్ పాల్స్ లూథరన్ దేవాలయంలో పాస్టర్ పి.ప్రవర్తన కుమార్, పి.మదన్ కుమార్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పెనుగొండ రాజు గూడెం లూథరన్ చర్చిలో సంఘ కాపరి పాస్టర్ ఉందుర్తి బాబు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

నరసాపురం: పట్టణ, మండలంలో బుధవారం క్రిస్మస్ పండుగను క్రైస్తవ సోదరులు ఘనంగా జరుపుకున్నారు. లూథరన్, జిడిఎం, జీవనజ్యోతి, పెంతికోస్తు, బిబిజి, స్టేషన్ పేట పలు చర్చిలలో, మండలంలోని కొత్త, పాత నవరసపురం, సరిపల్లి, చిట్టవరం, లక్ష్మణేశ్వరం, పసలదీవి, గొంది, సీతారాంపురం, రుస్తుంబాద గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఏసు జన్మదిన విశిష్టతను పాస్టర్లు క్రైస్తవ సోదరులకు బోధించారు. ఇటు చర్చి కమిటీలు క్రైస్తవ సోదరులు ఇబ్బందులు పడకుండా భారీ టెంట్లు ఏర్పాటు చేశారు.

మొగల్తూరు : ప్రజలను రక్షించేందుకే ఆ దేవుడు ఏసుక్రీస్తుగా జన్మించాడని పాస్టర్ రెవరెండ్ ఆదామ్ రాజు అన్నారు. మొగల్తూరులోని పాలపర్తి వారి పేటలో ఉన్న ప్యారిస్-1 చర్చిలో బుధవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీస్తు జనన సందేశాన్ని వినిపించారు. ఆయా కార్యక్రమాల్లో సంఘ పెద్దలు మైలావత్తుల శామ్యూల్ జాన్ పట్టానంద్, పోతురాజు, నవీన్, మేడిది బాబురావు, గన్నాబత్తుల శాంతరాజు, సండే స్కూల్ విద్యార్థులు, స్త్రీలు పాల్గొన్నారు.



ఆచంటలోని చర్చిలో కేక్ కట్ చేస్తున్న చిన్నారులు

ఇంటర్ కాలేజియేట్‌లో పాలకొల్లు విద్యార్థికి ద్వితీయ స్థానం

ప్రజాశక్తి - పాలకొల్లు

ఇంటర్ కాలేజియేట్ బెస్ట్ ఫిజిక్ టోర్నమెంట్‌లో ద్వితీయ స్థానాన్ని పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎ.జగదీష్ పొందారు. ఫస్ట్ ఎంఎ ఎకనామిక్స్ విద్యార్థి ఆదికవి నన్నయ యూనివర్సిటీ రాజమహేంద్రవరంలో డిసెంబర్ 21వ తేదీన జరిగిన ఇంటర్ కాలేజియేట్ బెస్ట్ ఫిజిక్ టోర్నమెంట్‌లో పాల్గొని ద్వితీయ స్థానం సాధించాడని ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. ఈ విద్యార్థికి ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ, వ్యాయామ విద్య అధ్యాపకులు జి.మహేష్, అధ్యాపక సిబ్బంది అభినందనలు తెలిపారు.

ప్రసాద్‌కు ఉత్తమ సామాజిక కార్యకర్త అవార్డు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మానవ హక్కులు, విద్య, శాంతి, సంస్కృతి, సామాజిక రంగాలలో విశేషమైన కృషి చేస్తున్న మార్టేరు ఉపాధ్యాయులు బండి ప్రసాద్‌కు ఉత్తమ సామాజిక కార్యకర్త అవార్డు లభించింది. ఈ బెస్ట్ సోషల్ యాక్టివిటీస్ అవార్డును మనం ఫౌండేషన్, కడప సంస్థ నుంచి నేడు అందుకున్నట్టు ఆయన తెలిపారు. బండి ప్రసాద్‌కి ఈ అవార్డు రావడం పట్ల నెగ్గిపూడి మదర్ థెరిస్సా ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సాకరాజు, మానవత జిల్లా, మండల కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయి శ్రీనివాస్, ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి, పలు ఉపాధ్యాయ సంఘం నాయకులు అభినందనలు తెలిపారు.

రహదారిపై నిలిచిన ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండల కేంద్రం మొగల్తూరులో నరసాపురం డిపోకు చెందిన బంటుమిల్లి నుంచి నరసాపురం వస్తున్న ఆర్‌టిసి బస్సు బుధవారం మరమ్మతులకు గురై రహదారిపై నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. కండక్టర్లు ఆ బస్సులోని ప్రయాణికులను మరో బస్సులో నరసాపురం వెళ్లే ఏర్పాటు చేశారు. నరసాపురం నుంచి ఆర్‌టిసి గ్యారేజ్ నుంచి సిబ్బంది వచ్చి బస్సుకి మరమ్మతులు చేసి తీసుకువెళ్లారు.

36 మందికి సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్ర ప్రజలపై రూ.14.5 కోట్ల అప్పు ఉన్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తోందని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. అయితే తిరిగి అధికారంలోకి రావాలని వైసిపి కుట్రలు చేస్తోందని అన్నారు. బుధవారం ఆయన క్యాంపు కార్యాలయం వద్ద 36 మంది లబ్ధిదారులకు రూ.22 లక్షల సిఎం సహాయ నిధి నుంచి చెక్‌లు అందించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ప్రజలు వైసిపి చేష్టలను తిప్పి కొట్టాలని కోరారు. నాడు జగన్ ఐదేళ్ల పాలనలో సిఎం సహాయ నిధులను సైతం పక్కదోవ పట్టించి, పేదలకు వైద్యాన్ని పూర్తిగా దూరం చేశాడని చెప్పారు. పేదలకు వైద్య సహాయం అందించక మానవత్వాన్ని జగన్ మరిచారని చెప్పారు. నేడు చంద్రబాబు అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి సహాయ నిధులను పేద, మధ్యతరగతి వర్గాలకు కొట్లాది రూపాయలు వైద్య సహాయంగా అందిస్తున్నారన్నారు. గత పాలనలో మిగిలిన వనరులను దోచుకోవడానికి మళ్లీ అధికారంలోకి రావాలనే కోరిక తప్ప, చేసిన అప్పులకు పశ్చాత్తాపం లేని జగన్‌ను ప్రజలు ఎప్పటికీ క్షమించరని చెప్పారు. జగన్ ఐదేళ్ల ప్రభుత్వంలో చేసిన పాపాలు, తప్పిదాలు నేడు ప్రజలపై భారం రూపంలో వెంటాడుతున్నాయని విమర్శించారు.

రూ.22 లక్షలు పంపిణీ చేసిన మంత్రి నిమ్మల

శరవేగంగా అభివృద్ధి పనులు

ఉండి : ఏకగ్రీవ పంచాయతీలకు ఇవ్వాల్సిన నిధులను ఇవ్వకుండా గ్రామ అభివృద్ధిని గత ప్రభుత్వం అడ్డుకుందని కలిగొట్ల గ్రామ సర్పంచి మాదిరెడ్డి సూర్య సత్యనారాయణ, ఎంపిటిసి రుద్రరాజు సూర్యనారాయణరాజు(యువరాజు) అన్నారు. ఉండి మండలం కలిగొట్ల గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీల సమస్య ఉందని ఉండి ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే తన నిధుల నుంచి రూ.20 లక్షలు సీసీ రోడ్ల నిర్మాణానికి కేటాయించారని సర్పంచి, ఎంపిటిసిలు తెలిపారు. ఆ నిధులను గ్రామంలోని ఎస్‌సి కాలనీ, బిసి కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి కేటాయించామని, 300 మీటర్లతో ఐదు సీసీ రోడ్లను ప్రారంభించగా అవి నిర్మాణ దశలో ఉన్నాయని వారు తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న తమ గ్రామానికి రూ.20 లక్షల నిధులు కేటాయించిన కనుమూరి రఘురామకృష్ణంరాజుకు ఈ సందర్భంగా గ్రామ ప్రజల తరపున వారు కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామ ఇంజనీరింగ్ అసిస్టెంట్ విజయ రోడ్ల నిర్మాణ పనులను శరవేగంగా జరిపిస్తున్నట్లు వారు తెలిపారు.

నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు

సిపిఐ శత వార్షికోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - భీమవరం

సిపిఐ శత వార్షికోత్సవాలను పార్టీ శ్రేణులు వాడవాడలా ఘనంగా నిర్వహించి వందేళ్ల ఉద్యమ పోరాట చరిత్ర వివరించాలని సిపిఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. బుధవారం భీమవరంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో సిపిఐ శత వార్షికోత్సవాల వాల్ పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో వందలాది మంది కమ్యూనిస్టులు తమ ప్రాణాలు కోల్పోయారన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, శ్రమ జీవుల బానిసత్వ విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగున్నర వేల మంది కమ్యూనిస్టులను కాల్చి చంపారన్నారు. ఖలిస్తాన్ తీవ్రవాద వ్యతిరేక పోరాటంలో 200 మంది, జిల్లాలో జరిగిన జమిందారీ వ్యతిరేక రైతాంగ పోరాటంలో 18 మంది కమ్యూనిస్టులు తమ ప్రాణాలను తుపాకీ గుళ్లకు అర్పించారన్నారు. ప్రజల జీవనోపాధి, ఆర్థిక సమానత్వం, సామాజిక న్యాయం, దోపిడీ రహిత సమాజ సాధన దిశగా వందేళ్లగా సిపిఐ నిర్విరామంగా పోరాడుతుందన్నారు. దేశ స్వాతంత్రోద్యమ పోరాటంలోనూ సిపిఐ అనిర్వచనీయమైన పాత్ర నిర్వహించిందన్నారు. స్వాతంత్రానంతరం కార్మికులు, కర్షకులు, రైతులు, మహిళలు, విద్యార్థులు యువత, దళిత, గిరిజన సమస్యలపై సిపిఐ అలుపెరుగని పోరాటాలు సాగించిందన్నారు. దున్నేవానిదే భూమి అంటూ సిపిఐ సాగించిన పోరాట ఫలితంగా పేదలకు లక్షలాది ఎకరాల భూమి పంపిణీ జరిగిందన్నారు. రాజభరణాలు రద్దు, బ్యాంకుల జాతీయకరణ సిపిఐ పోరాట ఫలితమేనన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాం ప్రసాద్, జిల్లా సమితి సభ్యులు మల్లుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేరు మార్పు

రేగాని అనురాధ (కొత్తపేరు), భర్త : బుల్లి అబ్బులు, డోర్‌నెం.31-6-15, ఏలూరి వారి వీధి, తణుకు, పశ్చిమ గోదావరి జిల్లా - 534211, ఆంధ్రప్రదేశ్ నందు నివసించుచున్నాను. ఇప్పుడు నా పేరును యు.ఎం.అనురాధ గాడి (పాత పేరు) నుండి రేగాని అనురాధ (కొత్తపేరు)గా మార్చుకున్నాను. ఈ రోజు నుండి అన్ని తదుపరి లావాదేవీలు కోసం రేగాని అనురాధ (కొత్తపేరును) ఉపయోగించవలెను.

CHANGE OF NAME

I, **REGANI ANURADHA**, W/o BULLI ABBULU, D.No. 31-6-15, Eluri vari Street, Tanuku, West Godavari Dist - 534211, AP. have changed my name from **UM ANURADHA GADI** (Old Name) to **REGANI ANURADHA** (New Name).
Hence Forth Iam being called as **REGANI ANURADHA.** (new name) forall Purpose.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం కాళీపట్నం గ్రామానికి చెందిన దువ్వాడ కేశవ తండ్రి రామకృష్ణ అను నేను నా యొక్క పాస్‌పోర్టు పడిపోయింది. పాస్‌పోర్టు నెంబర్: N3782643 గల పాస్‌పోర్టు ది.15-12-2024వ తేదీన మొగల్తూరు నుండి కాళీపట్నం వెళుతుండగా నా యొక్క పాస్‌పోర్టు పడిపోయింది. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

అడ్రస్ : **దువ్వాడ కేశవ,** తండ్రి : రామకృష్ణ
కాళీపట్నం, మొగల్తూరు మండలం
ప.గో.జిల్లా. సెల్ : 9032574935

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, తణుకు మండలం, వేల్పూరు గ్రామానికి చెందిన అడ్డా శ్రీనివాసరావు, S/o. అడ్డా దుర్గా వీరసత్య నారాయణ పాస్‌పోర్టు నెం.A2617779 వేల్పూరులోని మా ఇంటి దగ్గర నుండి జిరాక్స్ సెంటర్‌కు మోటారు సైకిలు పై వెళ్ళుతుండగా మార్గ మధ్యలో నా ఒరిజినల్ పాస్‌పోర్టు పడిపోయినది. చుట్టు ప్రక్కల ఎంత వెదకినను దొరకలేదు ఎవరికైన దొరికినచో ఈ క్రింది అడ్రస్సుకు తెలియజేయగలరు.

అడ్రస్సు : **అడ్డా శ్రీనివాసరావు,**
S/o.అడ్డా దుర్గా వీరసత్యనారాయణ,
డోర్‌నెం.7-29, వేల్పూరు, తణుకు మండలం,
ప.గో.జిల్లా. సెల్: 9704785464.

PUBLIC NOTICE

Under the instructions of my client **M/s.Shriram Finance Ltd.** Aswaraopeta Branch Rep by its Branch Manager it is stated that **Smt.Birudugadda Venkata Laxmi, w/o Rama Krishna, 44 years, R/o. Rudrakotarajugudem village. H/o T.Narasapuram village and Mandal, Eluru District,** is creating mortgage against her property shown below as security for the proposed trade loan. If anybody having any objection, they can send the objections to me or to my client within 3 days from the date of publication of this notice and further objections if any shall not bind my client

SHEDULE OF THE PROPERTY

RCC Buliding bearing H.No.6-16 with a plinth area of 644 Sq. feet along with its house site of an extent of 193.6 Sq yards or 162.6 sq meters or Ac.0-04 cents in R.S.No.645 situated at T. Narasapuram village and Mandal, Eluru District, bounded by **EAST :** 4 Sq. yards width of joint Way and place of Gummalla Durgamma. **SOUTH :** House and place of Ogirala Srini, **WEST:** House and place of Thati Jagadamba **NORTH :** House and place of Bejjam Adrusta Rao.

P.GANESH BABU
ADVOCATE,
KOTHAGUDEM
Kothagudam
Dt: 25-12-2024